06ATP27_06ATP27.qxd 18-02-2024 PM 10:51 Page 1



# ఎస్టీవర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.11,447 కోట్లు కేటాయింపు

### - ఎస్టీ వర్గాల సంక్షేమశాఖ మంత్రి బి.నాగేంద్ర హర్షం



జిల్లా మంత్రి బి.నాగేంద్ర

బళ్లారి, ఫిబ్రవరి18, ప్రభాతవార్త;

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2024-25 బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమశాఖచే షెడ్యూల్డ్ తెగల సమాజం ప్రజలకు రూ.11,447 కోట్లు కేటాయించారని, గత సంవత్సరంలో కేవలం రూ.9,960.30 కోట్లు కేటాయించగా ప్రస్తుత సంవత్సరంలో అదనంగా రూ.1486.70 కోట్లు పెంపు చేయడం జరిగిందని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల వర్గాల సంక్షేమశాఖ మంత్రి బి.నాగేంద్ర తెలిపారు. ఎస్టీ విద్యార్థుల రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రూ.2,700 కోట్లు పెంచడం జరిగిందని, మూడు శాఖల నుంచి మొత్తం 29 రెసిడెన్షియల్ స్కూళ్ల భవనాల నిర్మాణానికి రూ.638 కోట్లు కేటాయించారని చెప్పారు. ప్రీ మెట్రిక్, మెట్రిక్‌నంతర వసతిగృహాల భోజన వ్యయాన్ని ప్రతి విద్యార్థికి నెలకు రూ.100 పెంచినట్లు తెలిపిన మంత్రి, ఎస్సీ, ఎస్టీవర్గాల ప్రజల చికిత్స వ్యయం కల్పించేందుకు రూ.35 కోట్ల కార్పస్ ఫండ్‌ను స్థాపించినట్లు మంత్రి ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమం, ఎస్టీవర్గాల సంక్షేమశాఖల కింద వచ్చే సంస్థలకు రూ.1750 కోట్లు కేటాయించినట్లు సహకార శాఖ నుంచి సహకార పాలకమండలిలో ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించేందుకు నియమావళిలలో సవరణ తేనున్నట్లు సీఎం ప్రకటించారని మంత్రి బి.నాగేంద్ర వివరించారు.

# లారీ టర్మినల్స్ స్వచ్ఛత, అభివృద్ధికి చర్యలు



లారీ టర్మినల్స్ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో సమస్యలను ఆలకిస్తున్న కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్

బళ్లారి, ఫిబ్రవరి18, ప్రభాతవార్త;

నగరంలోని కేఎస్ఆర్‌టీసీ బస్టాండ్‌లో గల ట్రాన్స్‌పోర్టు లారీల కేంద్రంగా పిలవబడే లారీ టర్మినల్స్ ప్రాంతంలో స్వచ్ఛతకు, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ ఎం.ప్రభంజన్‌కుమార్ ట్రాన్స్‌పోర్టు యజమానులకు హామీ ఇచ్చారు. టర్మినల్స్ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో అక్కడి సమస్యల గురించి తెలుసుకున్నారు. మహానగరపాలికె ఇంజనీర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌లతో లారీ టర్మినల్స్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి రోడ్లను స్వచ్ఛత పరచాలని సూచించారు. ఓపెన్ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని, టర్మినల్ స్‌లో నూతన రోడ్లు నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. టర్మినల్స్‌లో లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసులతో పాటు వర్క్‌షాపులు ఆటో మొబైల్ దుకాణాలు ఉండడంతో వందలాది మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారని, ప్రతిరోజూ దూర ప్రాంతాల నుంచి వందలాది లారీల డ్రైవర్లు, క్లీనర్‌లు సరుకు రవాణా కోసం వచ్చి బస చేస్తారని, వారికి ఎటువంటి మౌలిక సదుపాయాల వ్యవస్థలేదని స్థానికులు తెలిపారు. తాగేందుకు శుద్ధమైన నీరు పరిస్థితి ఉన్నదని, హోటళ్లకు వెళ్లి నీరు తాగాల్సిన పరిస్థితి ఉన్నదని, లేకపోతే డబ్బుతో బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తున్నదని పలువురు డ్రైవర్‌లు కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్‌కు తెలిపారు. ఇదే సందర్భంలో లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు, సభ్యులు పరిస్థితి గురించి వివరించగా, ఒకరోజుపాటు టర్మినల్ స్‌లో శ్రమదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పగా, అందుకు వారు తాము కూడా ఈ కార్యంలో పాలు పంచుకుంటామని చెప్పారు. తదనంతరం అభివృద్ధి పనులకు ప్రతిపాదన సిద్ధం చేసే విషయమై పాలికె ఇంజనీర్లతో ప్రభంజన్‌కుమార్ మాట్లాడారు.

# హరిగినడోణిలో తాగునీటి యోజనకు మంత్రి నాగేంద్ర శ్రీకారం



హరిగినడోణిలో తాగునీటి యోజనను ప్రారంభిస్తున్న జిల్లా మంత్రి బి.నాగేంద్ర

బళ్లారి, ఫిబ్రవరి18, ప్రభాతవార్త;

తాలూకాలోని హరిగినడోణి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి యోజనకు రాష్ట్ర ఎస్టీవర్గాల సంక్షేమశాఖ, యువసబలీకరణ క్రీడాశాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర ఆదివారంనాడు శ్రీకారం చుట్టారు. అనేక దశాబ్దాలుగా తీవ్ర నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తాలూకాలోని హరిగినడోణి, జానెకుంట, హరిగినడోణితండా గ్రామాల ప్రజలకు తాగునీటి సౌలభ్యం కల్పించడంతో గ్రామప్రజలు సంబరాలు జరుపుకోవడం కనిపించింది. పైపులైన్ ద్వారా గ్రామానికి వచ్చిన నీటిలో పిల్లలు స్నానమాడుతూ చిందులు వేశారు. యోజనకు శ్రీకారం చుట్టి మాట్లాడిన మంత్రి నాగేంద్ర ఎమ్మెల్యే నిధులతో హరిగినడోణి గ్రామానికి బళ్లారి అల్లీపుర చెరువు నుంచి సుమారు 9 కి.మీ. పొడవున పైపులైన్‌ను నిర్మించి తద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా చేసినట్లు, కొన్ని దశాబ్దాలుగా ఆచరణకు నోచుకోలేని ఈ యోజనకు నేడు శ్రీకారం చుట్టడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు. తమకు దాహార్తిని తీర్చాలని, తాగునీటి సౌలభ్యానికై హరిగినడోణి గ్రామప్రజలు ఎన్నోసార్లు ప్రతిఘటనలు చేశారు. ఎన్నికలు బహిష్కరించారు. గత సంవత్సరం విధానసభ ఎన్నికల సందర్భంలో గ్రామ ప్రజలకు తాము ఇచ్చిన హామీ మేరకు నేడు గ్రామానికి తాగునీటి యోజనను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం తాత్కాలికంగా హరిగినడోణికి పైపులైన్ ద్వారా తాగునీటి సౌలభ్యం కల్పించినట్లు, తదనంతరం సుమారు రూ.25 కోట్ల వ్యయంతో గ్రామ సమీపంలో తాగునీటి రిజర్వాయర్‌ను నిర్మించే బృహత్ యోజనను చేపడుతున్నట్లు, దీంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మరిలింగమ్మ, గ్రామ పంచాయతీ సభ్యులు గంగాధర్, సి.చంద్రప్ప, వెంకారెడ్డి, బి.బసవన్నగౌడ, గంగన్న, మల్లికార్జున, శంకరప్ప, హొన్నూరప్ప, జగదీష్, జడియప్ప, మహారుద్రగౌడ, గవిసిద్ధన్నగౌడ, శివరామ్‌రెడ్డి, దొడ్డబసప్ప, వెంకటరావ్ నాని తదితర వందలాది మంది గ్రామప్రజలు పాల్గొన్నారు.

# సిద్ధం ప్రోగ్రామ్‌కు షాక్ ఇచ్చి టిడిపిలోకి వలస ప్రవాహం..

### - టిడిపితోనే అభివృద్ధి సాధ్యం.. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



వైసీపీ పార్టీని టిడిపిలో చేరిన వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

నియోజకవర్గం లో టిడిపిలో వలసల పరంపర ప్రవాహంలా కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామిపై అభిమానంతో పాటు, గతంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై 10 రోజులుగా వైసీపీ కార్యకర్తలతోపాటు మడకశిర మండల పరిధిలోని టిడి పల్లి తాండ తదితర గ్రామాలకు చెందిన వందలాది వైకాపా కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపల్లి తాండాకు చెందిన గాయత్రి, వరలక్ష్మి, రాజు, నాగరాజుల ఆధ్వర్యంలో టిడిపిలోకి దాదాపు 50 కుటుంబాలు చేరారు. లక్ష్మి, గంగమ్మ, రత్నమ్మ, పార్వతమ్మ, లక్ష్మిబాయి, రంగమ్మ, శ్యామల, కుముదాలతోపాటు వారికి మెడలో టిడిపి కండువాలు వేసి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేఏస్వామి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ఒక్క రోడ్డు కానీ, సామాజిక భవనం కానీ నిర్మించలేదన్నారు. గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు టిడిపి హయాంలోనే ఎక్కువగా వెచ్చించినట్లు తెలిపారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులుపడుతు న్నారు. రాష్ట్రంలో రకరకాల పన్నుల రూపంలో,నిత్యావసర ధరలు పెంపు, రవాణా, కరెంటు చార్జీలు పెంపు రూపంలో వారి నెత్తిన మోయలేని భారంగా మోపారని మాజీ ఎమ్మెల్సీ విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. టిడిపిలో ఉన్న కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి వారిని రక్షించుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, టిడిపల్లి సీనియర్ నాయకులు రంగేగౌడ్, గిరి, ఐటిడిపి నాయకుని శివానంద, గోవిందనానయక్, ఆకాష్‌నాయక్, రామాంజినాయక్, గోవింద, రంగే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ చోళమాంబ దేవి భక్తి పాటలు విడుదల

అమరాపురం,పిబ్రవరి 18,ప్రభాతవార్త:



సన్మానం చేస్తున్న దృశ్యం

అమరాపురం గ్రామ దేవత అయిన శ్రీ చోళమాంబదేవి పాటలను ఆలయ కమిటి సభ్యులు శివకుమార్ గౌడ్ చేతుల మీదుగా,అమరాపురం గ్రామానికి చెందిన ఎల్ ఆర్‌సి డాన్స్ మరియు యాక్టింగ్ ఆకాడమీ నిర్వహకుడు రవిచంద్ర రచించిన భక్తి పరవశమైన పాటను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలదాత బావాజీ లక్ష్మన్‌దాస్ గారి మనవడు అయిన రవిచంద్ర అమ్మవారి భక్తి పాటను రచించడంతో పాటు సినిమా సంగీత దర్శకుడు,గాయకుడు ధర్మల్ సింగ్ రాజ్పుత్ బృందంచే ముజికల్ చేయించడం జరిగిందని తెలిపారు.భక్తిపరవశమైనటువంటి విధంగా రచించడం పట్ల రవిచంద్రను ఆలయ కమిటీ వారిచే ఘనంగా సన్మానం చేశారు.వీరి కుటుంబం కేవలం అమ్మవారి పాటకు కాకుండా విద్యార్థులు చదువుకోవాలనే లక్ష్యంతో అమరాపురం ఉన్నత పాఠశాలకు గాను దాదాపు పది ఎకరాలకు పైన వీరితాత బాబాజీ లక్ష్మన్‌దాస్ విరాళంగా అందజేయడం ఈ కుటుంబానికి ఉన్న ఉదారతకు నిదర్శనమని కొనియాడారు.అనంతరం ఎల్‌ఆర్సి నిర్వహకుడు రవిచంద్ర మాట్లాడుతూ అమరాపురం గ్రామ శక్తి దేవత శ్రీ చోళమాంబ దేవి మొట్టమొదటి శక్తి పాటను రచించు అవకాశం రావడం తన అదృష్టమన్నారు.ఈభక్తి పాటను అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో విడుదల చేయడం జరిగింది.గ్రామ దేవత ఉత్సవాలను 102 సంవత్సరాల తరువాత ఐదు గ్రామల ప్రజలు భక్తి భావంతో నిర్వహించడం ద్వారా ఈ పాటను అమరాపురం మండల ప్రజానీకానికి,సమీప కర్ణాటక రాష్ట్రం ప్రజలకు అంకితం చేస్తున్నట్లు రవిచంద్ర తెలిపారు.అనంతరం అతన్ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేశారు.

# శుభకార్యాలకు హాజరైన మడకశిర నియోజకవర్గ ఇంచార్జ్



వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

అమరాపురం,పిబ్రవరి 18,ప్రభాతవార్త:

మండలం నందు జరిగిన పలు శుభ కార్యలకు మడకశిర నియోజకవర్గ ఇంచార్జ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆదివారం హాజరైనారు.హలుకూరు మాజీ సర్పంచ్ ప్రకాష్ కుతూరు వివాహము పావగడ పట్టణం ఎస్ఎస్‌రె సముదాయం భవనంలో జరిగిన కార్యక్రమానికి వలస,అగ్రహారం గ్రామాల్లో జరిగిన వివాహానికి మరియు గృహప్రవేశానికి తదితరకార్యక్రమంలో పాల్గొని నవవధువరులను ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో టిడిపిపార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్ధం సమావేశానికి బయలుదేరిన వైకాపాశ్రేణులు



బయలుదేరుతున్న దృశ్యం

అమరాపురం,పిబ్రవరి 18,ప్రభాతవార్త:

మండలంలో ప్రతి సచివాలయ పరిధిలో రెండు ప్రత్యేక బస్సు లు కేటాయించడం ద్వారా స్థానిక నాయకులు,కార్యకర్తలు రాప్తాడులో జరిగిన సిద్ధం సమావేశానికి బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి అమరాపురం సర్పంచ్ వాగేష్,రాష్ట్ర వైకాపా బీసీ విభాగపు ఉపాధ్యక్షుడు హల్కూరు కాంతరాజు ప్రజల సమక్షంలో మరియు స్థానిక ఎంపిపి ఈరన్న,జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి,వైస్ ఎంపిపిలు రంజిత్ కుమార్,కృష్ణమూర్తి మరియు ఒక్కలిగా కార్పోరేషన్ డైరెక్టర్లు సమక్షంలో నాయకులు,కార్యకర్తలు ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు.ఈ సందర్భగా వాగేష్ మాట్లాడుతూ జగన్ చేసిన సేవలు ద్వారా ప్రజలు మరోసారి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

# ధర్మవరంలో టిడిపి జెండా ఎగురవేస్తాం..

### - మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం..

ధర్మవరం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



సూపర్-6 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పరిటాల శ్రీరామ్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ధర్మవరంలో కచ్చితంగా తెలుగుదేశ ంపార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీ రామ అన్నారు. బాబు సూపర్-6 కార్యక్రమంలోభాగంగా ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ, మండల కేంద్రంలోని 1వ వార్డులో పరిటాల శ్రీరామ్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్తూ టిడిపి ప్రకటించిన మినీ మ ఏనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ అందులో పథకాలను గురించి ఓటర్లకు వివరించారు. ఆ ప్రాంతంలో సమస్యలు గురించి ఆరా తీయగా ప్రధానంగా తాగునీరు, రోడ్ల సమస్యలను గ్రామస్తులు శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తాగునీరు 10 రోజులకు ఒక్కసారి వస్తాయని, వాటిని నిల్వ ఉంచుకుని ఉపయోగించుకుంటున్నామని, కనీసం రెండు మూడు రోజులకు ఒక్కసారైనా తాగునీరు వచ్చే విధంగా చూడాలని కోరారు. దీనికి స్పందించిన శ్రీ రామ్ టిడిపి అధికారంలోకి రాగానే నియోజకవర్గంతోపాటు మండల కేంద్రంలో నెలకొన్న సమస్యను శాశ్వితంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిడ్డంగులశాఖ చైర్మన్‌కు ఘనసన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్మన్ కరీముల్లాను ఆదివారం గుత్తి పట్టణంలో ఘన సన్మానం చేశారు. వైకాపా కార్యదర్శి అన్వర్‌కురేషీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. పట్టణంలో ప్రభుత్వ పరంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరీముల్లా, మున్నా, డిష్ ఖాజా, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# విషపూరిత ఆహారం తిని గొర్రెలు మృతి

విడపనకల్లు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు

మండలంలోని చీకలగురికి గ్రామ పోలాల్లో హైడ్రోజన్ సైనైడ్ విష ప్రయోగానికి గురై 62 గొర్రెలు మృతి చెందాయి. కూడేరు మండలంల ఉదిరిపి కొండ తండాకు చెందిన ఆర్.కుళ్లాయప్ప నాయక్, చిన్న నారాయణ నాయక్‌ల గొర్రెల మందలు ఆదివారం విష ఆహారం తినడంతో 90 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. వాటికి చికిత్స నిర్వహించగా 38 గొర్రెలు కొలుకోగా అందులోని 62 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. చనిపోయిన గొర్రెలకు పశు వైద్యుడు నరేష్ పోస్టుమార్టం నిర్వహించి పరీక్షించగా హైడ్రోజన్ సైనైడ్ విషప్రయోగానికి గురై మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. దీంతో బాధితులకు దాదాపు 9 లక్షల రూపాయల వరకు నష్టం సంభంవించినట్లు పేర్కొన్నారు.

# అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మృతి చెందిన రైతు మీసాల చిన్నవన్నూరప్ప (ఫైల్‌ఫోటో)

అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దుర్ఘటన పాల్తూరు పోలీసుస్టేషన్ పరిధిలోని హావళిగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన రైతు మీసాల చిన్నవన్నూరప్ప (53) సొంత పొలం ఒకటిన్నర ఎకరాలు వుంది. ఈ పొలంతో పాటు మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప సాగు చేశాడు. వ్యవసాయం కోసం 6 లక్షల రూపాయల వరకు అప్పులు చేశారు. అయితే దిగుబడి సరిగా రాకపోవడంతో పంటల సాగు కోసం చేసిన 6 లక్షల రూపాయల అప్పు తీర్చే మార్గం కనిపించలేదు. అప్పులబాధ తట్టుకోలేక సతమతమవుతూ తీవ్ర మనస్థాపానికి గురై శనివారం రాత్రి ఇంటిలో పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హుటాహుటిన బళ్లారి హోపిడి ఆసుపత్రికి తరలించారు. అయితే ఆదివారం చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

# జర్నలిస్టుపై దాడి చేయడం పిరికిపంద చర్య-గుండుమల

మడకశిర ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభ కవరేజ్ కోసం వెళ్లిన ఏబీఎన్ జిల్లా ఫోటోగ్రాఫర్ కృష్ణ పై వైకాపా నాయకులు దాడి చేసి గాయపరచడం పిరికి పందల చర్య అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వైకాపాప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారథిగా సమాజంలో నాలుగవ స్తంభమైన జర్నలిస్టులపై ఈ ప్రభుత్వంలో దాడులు పెచ్చుమీరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి ధర్మంలో భాగంగా విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై భౌతికంగా దాడి చేస్తుంటే పోలీసులు అడ్డుకోకపోవడం విడ్డూరమని అన్నారు. వైకాపా నాయకులు జర్నలిస్టుపై ఉన్మాదుల్లా దాడి చేశారని దాడి చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# జగన్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం

### రైతుల అక్రమ అరెస్టులు అన్యాయం

మడకశిర ఫిబ్రవరి 18 ప్రభాతవార్త;



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

రాప్తాడులో జరిగే సిద్ధం సభకు వచ్చిన ముఖ్య మంత్రి జగన్మోహ న్‌రెడ్డిని ఎర్రట్టప్పరి వివాహాశ్రయం దగ్గర భవనం పైకెక్కి శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న అన్నదాతలను అక్రమంగా అరెస్టులు చేసి బుక్కపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తేదేపా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులు తమను ఆదుకోవాలని తెలపడానికి వెళితే వారిని అరెస్టు చేయడం దారుణమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. హంద్రీనీవా ద్వారా మడకశిర కెనాల్‌కు వెంటనే తరలించాలని అన్నారు. మడకశిర ప్రాంతంలో ఈ సంవత్సరం వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో కరువు తాండవిస్తోంటే ఇప్పటి వరకు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పట్టు రైతులకు 2019 నుండి ఇప్పటివరకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ చెల్లించకుండా కాలాయాపన చేస్తోందని అన్నారు. పట్టు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన అన్నదాతలను వెంటనే విడుదల చేయాలని, కరువు రైతులను వెంటనే ఆదుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# నేడు 'స్పందన' ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నేడు యధాతథంగా నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో కూడా చేపడుతున్నట్లు తెలియజేశారు. జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నుండి పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలు నందు ఉదయం 09:30 గంటల నుండి నిర్వహించడంజరుగుతుందన్నారు. కావున ప్రజలు వారి వారి సమస్యలను వినతుల రూపంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలని సూచించారు.

# రాయలసీమ ప్రజలకు ఏం చేశావు జగన్‌రెడ్డి..?

### -జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూటిప్రశ్న

ధర్మవరం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన సిద్ధం కార్యక్రమంపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదివారం తన స్వగృహంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ కరువు పేరు చెప్పి రాయలసీమ ప్రజలను ఇంకెన్ని మార్లు మోసం చేస్తావ్ జగన్‌రెడ్డి, ప్రజలు నీ మోసాలన్నీ గ్రహించారన్నారు. రాయలసీమ ప్రజలే మీ ప్రభుత్వాన్ని గద్దె దించుతారంటూ ఆగ్రహం వ్య క్తం చేశారు. రాయలసీమ యువతకోసం ఏంచేశావని సిద్ధం బహిరంగసభ నిర్వహించావు జగన్‌రెడ్డి అంటూ ప్రశ్నించారు. యువత కోసం ఎన్ని ఫ్యాక్టరీలు తీసుకొచ్చి ఎంత మందికి ఉద్యోగాలు కల్పించావో శ్వేతపత్రం విడుదల చేయి జగన్‌రెడ్డి అన్నారు. 57 నెలలో నువ్వు సాధించిన అభివృద్ధి భూకబ్జాలు, రౌడియిజం, గుండాయిజం, ఇసుక దందాలు మాత్రమేనన్నారు. రాయలసీమ రైతులను నట్టేట ముంచావు కాబట్టే రాయలసీమ ప్రజలే మీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా వున్నారన్నారు. పేరుకు మాత్రం కులానికి ఓ కార్పోరేషన్ పెట్టారే గాని కార్పోరేషన్ ద్వారా ప్రజలకు చేసింది శూన్యం కాదా అన్నారు. నాయకులు, కార్యకర్తలకు మాత్రం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రోటోకాల్ కల్పించారన్నారు. సిద్ధం సభలో జగనన్న మందు, జగనన్న బిర్యాని, జగనన్న వెయ్యి రూపాయలు మాత్రమే కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# 20వ తేదిన కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

20వ తేదిన మడకశిర కోల్డ్‌స్టోరేజ్‌లో కాంగ్రెస్‌పార్టీ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్‌లోకేష్, జిల్లాకాంగ్రెస్‌ప ఆర్టీఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, బి.బ్లాక్‌అధ్యక్షులు త్యాగరాజుతెలిపారు. పంచాయితీ వారీగా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# తప్పిపోయిన బాలుడు .. ఆచూకీ తెలపండి

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మండల పరిధిలోని దొక్కలపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప కుమారుడు దాసప్ప (16) 24 గంటలుగా ఇంటిలో కనపడటంలేదని గ్రామంలో సైతం ఎక్కడ వెతికినా ఆచూకి తెలియడం లేదని, సమాచారం తెలిపితే అగళిపోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని బాలుడి తండ్రి కోరారు.

# నేడే వాలెంటీర్లకు సన్మానం

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మండల పరిధిలో సచివాలయాలవారీగా పనిచేస్తున్న వాలెంటీర్లకు ఉత్తమ సేవా పథకాలతోపాటు నగదు బహుమతులను అంజదేయనున్నట్లు ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్‌తెలిపారు. ఈ కార్యక్రమానికి వాలెంటర్లీతో పాటు జడ్పిటిసి ఎంపిపి, సర్పంచులు ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు.

# విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలి

గుత్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించి రాణించాలని కెఎస్‌కె స్కూల్ కరస్పాండెంట్ సునీల్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక పాఠశాలలో ఆదివారం శ్రీసరస్వతిదేవిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతిపూజ చేస్తున్న దృశ్యం

